**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

**ఫోన్ నెం : 9885315759**



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు..

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 254 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 3 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## ఢిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం

**సీఈసీతో భేటీ నుంచి మమతా బెనర్జీ వాకౌట్**



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చేస్తోన్న పోరాటం ఢిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో...

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌కు తప్పిన ప్రమాదం

ఇంధన స్విచ్‌లో లోపాన్ని గుర్తించిన పైలట్

బెంగళూరులో నిలిపివేత

- మిగతా 2లో...





# వైకాపా వారి ఉచ్చులో పడొద్దు

- కావాలనే రెచ్చగొడుతున్నారు
- తాము చేసిన ఘోర పాపాల్ని డైవర్ట్ చేయాలని చూస్తున్నారు
- తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించి తీరతాం
- పార్టీ ముఖ్యనేతలతో అధినేత చంద్రబాబు



'హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై పుట్టిన వైకాపా రెచ్చగొట్టినా వారి ఉచ్చులో పడొద్దు. అలా చేస్తే వారికి మనకీ తేడా ఉండదు. ప్రజలకు మేలు చేయడమే మన పార్టీ సిద్ధాంతం. ఇదే విషయాన్ని పార్టీ శ్రేణులకు స్పష్టం చేయండి' అని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శ్రేణులు సంయమనంతో వ్యవహరించేలా మంత్రులు, సీనియర్ నేతలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం ఉదయం పలువురు పార్టీ ముఖ్యనేతలతో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో హింసను ప్రేరేపించేలా వైకాపా వాళ్లు కుట్రలు పన్నుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి ఘోర పాపం చేసిన వాళ్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఆ అంశాన్ని పక్కదారి పట్టించాలని





# రాహుల్ Vs రాజ్ నాథ్

## లోక్ సభలో మాటల యుద్ధం

**లద్దాఖ్, డోక్లాంపై ప్రశ్నించిన రాహుల్**

- మాజీ ఆర్మీ చీఫ్ బుక్ లోని అంశాలు ప్రస్తావించిన రాహుల్
- పబ్లిష్ కాని బుక్ పేరు ప్రస్తావించొద్దన్న రాజ్ నాథ్
- దేశభద్రతపైనే మాట్లాడుతున్నానన్న విపక్ష నేత
- అభ్యంతరం వ్యక్తం చేసిన అమిత్ షా

- మిగతా 2లో...

దేశ భద్రత అంశాలపై జరిగిన చర్చ కాస్తా లోక్ సభలో రచ్చగా మారింది. లద్దాఖ్, డోక్లాం ప్రతిష్టంభనపై విపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటిని ఓ మ్యాగజైన్ ప్రచురించిందంటూ లోక్సభలో ప్రస్తావించారు. ఆయన వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్నాథ్ సింగ్ ఖండించారు. రాహుల్ చెబుతున్న పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని.. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని రాజ్నాథ్ సింగ్ ప్రశ్నించారు. దీంతో తాను దేశ భద్రత పైనే మాట్లాడుతున్నానంటూ రాహుల్ కౌంటర్ ఇచ్చారు. ఇదే సమయంలో



## షేక్ హసీనాకు 10 ఏళ్ల జైలుశిక్ష

**ప్లాట్ల కేటాయింపు కేసుల్లో కోర్టు తీర్పు**

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా(79)కు ఢాకా స్పెషల్ జడ్జస్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రెండు వేర్వేరు అవినీతి కేసులకు సంబంధించి ఈ తీర్పునిచ్చింది. ఒక్కో కేసుకూ 5 ఏళ్ల చొప్పున శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది. పుర్బాచోల్‌లోని రాజుక్ న్యూ టౌన్

- మిగతా 2లో...



## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

**బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు**

- తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి
- బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు
- హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని వెల్లడి

- మిగతా 2లో...



## తిరుమలలో వైకాపా చేసింది ముమ్మాటికీ మహాపచారమే

'వైకాపా పాలనలో తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని సిట్ తేల్చింది. రసాయనాలు, పామాయిల్ ఉపయోగించి తయారు చేసిన నూనెతో లడ్డూలు తయారు చేసి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. కోట్లమంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని.. జంతువుల కొవ్వు కలిసిందా లేదా అనే విషయాన్ని సిట్ బహిర్గతం చేయలేదు. లడ్డూ విషయంలో వైకాపా నేతలు చేస్తున్న గోబెల్స్ ప్రచారం ఆగాలంటే వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలి'

- మిగతా 2లో...



## భారత్‌పై సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నాం

- మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు ఆ దేశం అంగీకరించింది
- మోదీ నాకు గొప్ప స్నేహితుడు
- ప్రధానితో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన
- 25 శాతం అదనపు సుంకాలూ ఉండబోవన్న శ్వేతసౌధం
- ట్రంప్‌నకు 140 కోట్ల మంది తరఫున కృతజ్ఞతలు.. సుంకాల తగ్గింపుపై మోదీ
- వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావించని ప్రధాని

- మిగతా 2లో...



## దలైలామాకు గ్రామీ అవార్డు

**మెడిటేషన్స్‌పై ప్రసంగ ఆల్బమ్‌కు దక్కిన గౌరవం**

**మండిపడిన చైనా**

లాస్ ఏంజెలెస్: ప్రముఖ బౌద్ధ గురువు దలైలామాకు గ్రామీ అవార్డు దక్కింది. 'మెడిటేషన్స్: ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిస్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు ఈ గౌరవం దక్కింది.

- మిగతా 2లో...

## నాకు ఏదైనా జరిగితే లోకేశ్ దే బాధ్యత



- నారా లోకేశ్ ఆదేశాలతోనే తన ఇంటిపై దాడి జరిగిందన్న జోగి రమేశ్
- తనను, తన తమ్ముడిని అక్రమంగా 83 రోజులు జైల్లో పెట్టారని మండిపాటు
- తనకు అండగా జగనన్న, వైసీపీ సైన్యం ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో...

# వాణిజ్య ఒప్పందానికి ఓకే

దిల్లీ: భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం(ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి.

శ్వేతసౌధం కూడా ఈ అదనపు సుంకాల తొలగింపును ధ్రువీకరించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ప్రకటన చేశారు. "ప్రధాని మోదీతో మాట్లాడటాన్ని గౌరవంగా భావిస్తున్నా. నాకున్న గొప్ప స్నేహితుల్లో ఆయన ఒకరు. భారత్‌కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోదీపై గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోదీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై మోదీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అధ్యక్షుడు ట్రంప్‌నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది. రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని మోదీ వివరించారు. మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌లో తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ మూడు రోజుల అమెరికా పర్యటన ప్రారంభమైన నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# తిరుమలలో వైకాపా చేసింది ముమ్మాటికీ మహాపచారమే

-మొదటిపేజీ తరువాయి

అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం జనసేన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వీర మహిళ ప్రాంతీయ సమన్వయకర్తలు, అధికార ప్రతినిధులు, వివిధ విభాగాల ఛైర్మన్లు పాల్గొన్నారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ ఏం మాట్లాడారంటే..

'కాసులకు కక్కుర్తి పడి వైకాపా నాయకులు తిరుమలలో అపచారం చేశారు. నిబంధనల్ని అడ్డగోలుగా మార్చేసి టన్నుల కొద్దీ కల్తీ నెయ్యి కొని తెచ్చి ప్రసాదాల్లో కలిపేశారు. రూ.400కి కిలో నాణ్యమైన నువ్వుల నూనె కూడా దొరకదు. అలాంటిది నెయ్యి ఎక్కడ దొరుకుతుంది? అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వైకాపా అపరాధాలను మనం ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి' అని అన్నారు.'వైకాపా నాయకులతో వ్యక్తిగత ద్వేషం, వైరం లేదు. వాళ్ల భాష, నేర స్వభావంతోనే సమస్య. ఇళ్లల్లోకి వస్తాం, దాడులు చేస్తాం, నరికేస్తాం అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. వాళ్ల భాష సరిగా లేని కారణంగానే ఈరోజు దాడులు జరుగుతున్నాయి. దాడులను, హింసను ఏ రాజకీయ పార్టీ సమర్థించదు. సీఎం చంద్రబాబు కూడా చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని చెబుతున్నారు. వైకాపా నాయకులు ప్రజల్లో భయం సృష్టిస్తున్నారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే.. అంటూ భయపెడుతున్నారు. గతంలో వాళ్ల ప్రవర్తన వల్ల 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. మరో 15 ఏళ్లు కూటమి అధికారానికి ఢోకా లేదు. ప్రజలు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

**ఎన్నికలు నిర్వహించి పార్టీ పదవులు**

'నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పదవులకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించాం. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురం నియోజకవర్గంలో ఇలా చేశాం. అన్ని నియోజకవర్గాల్లో ఇదే ప్రక్రియ అమలు చేస్తాం. రాష్ట్రంలో జిల్లాలను జోన్లుగా విభజించుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలి. మార్చి 14న పార్టీ ఆవిర్భావ దినోత్సవం 'జెన్ జి డే' ఏర్పాట్లపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సామాజిక మాధ్యమాలు గెలుపు ఓటముల్ని నిర్ణయించే ఆయుధం కాదు. అది గెలుపునకు ఒక కారణం మాత్రమే అవుతుంది. సామాజిక మాధ్యమాలే గెలుపును ప్రభావితం చేస్తే అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ గెలిచేవారే కాదు. ఆయనపై వచ్చినన్ని ట్రోలింగులు ఎవరిపైనా రాలేదు. మన పార్టీపై వచ్చిన వ్యతిరేక వార్తలను మనమే వైరల్ చేస్తున్నాం. దానివల్ల మరింత బలం చేకూరుతోంది. ఆ పద్ధతి మనం మార్చుకోవాలి' అని జనసేన అధ్యక్షులు చెప్పారు.

**32 మందితో క్రమశిక్షణ కమిటీ**

పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 32 మందితో క్రమశిక్షణ కమిటీని నియమిస్తున్నాం. ప్రారంభంలో ఈ కమిటీకి నేనే అధ్యక్షుడిగా ఉంటాను. కమిటీలో ఉండే ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఈ కమిటీలో మూడోవంతు మారుస్తూ ఉంటాం. పార్టీ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాలి. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం' అని పవన్ కల్యాణ్ అన్నారు.

# నాకు ఏదైనా జరిగితే లోకేశ్ దే బాధ్యత

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లపై మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను 83 రోజులు జైల్లో పెట్టినా మీ కడుపు మంట చల్లారలేదా చంద్రబాబూ? అని ఆయన ప్రశ్నించారు. నారా లోకేశ్ ఆదేశాలతోనే తన ఇంటిపై దాడి జరిగిందని అన్నారు. తనను అంతం చేయాలనే ఆలోచన లేకపోతే దాడి ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. తనకు ఏమైనా జరిగితే లోకేశ్ దే బాధ్యత అని అన్నారు. నీ రెడ్ బుక్ తీసి మడిచిపెట్టుకో అంటూ లోకేశ్ ను ఉద్దేశించి జోగి రమేశ్ అన్నారు. తప్పుడు కేసుతో తనను, తన తమ్ముడిని అక్రమంగా 83 రోజులు జైల్లో పెట్టారని జోగి రమేశ్ మండిపడ్డారు. మమ్మల్ని వేధించి రాక్షసానందం పొందుతున్నారా? అని ప్రశ్నించారు. ఒక కుట్ర ప్రకారమే తన ఇంటిపై దాడి జరిగిందని అన్నారు. మీరు బూతులు తిడితే తప్పులేదు కానీ... మేము ప్రశ్నిస్తే తప్పా? అని నిలదీశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి గూండాలను రప్పించారని ఆరోపించారు. ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ దాడికి దిగిందని అన్నారు. టీడీపీ గూండాలకు పోలీసులు రక్షణ కల్పించారని మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే తన ఇంటిపై దాడి జరిగిందని అన్నారు. ఆ సమయంలో పోలీసుల చేతుల్లో లాఠీలు కూడా లేవని చెప్పారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు ప్రారంభమయిందని చెప్పారు. తనకు అండగా జగనన్న, వైసీపీ సైన్యం ఉందని అన్నారు. తాను ఎక్కడికీ పారిపోనని చెప్పారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నానని... కేసులకు, అరెస్టులకు తాను భయపడేది లేదని అన్నారు. తన ఇల్లు తగలబెట్టి లోకేశ్ దగ్గర మంచి మార్కులు కొట్టేద్దామని కొందరు అనుకుంటున్నారని దుయ్యబట్టారు.

# ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌కు తప్పిన ప్రమాదం

దిల్లీ: ఎయిరిండియా బోయింగ్ 787-8 విమానం ఇంధన నియంత్రణ వ్యవస్థలో లోపం ఉందని పైలట్ గుర్తించడంతో అది బెంగళూరులో దిగిన వెంటనే క్షుణ్నంగా తనిఖీలు చేపట్టారు. ఈ విమానం 200 మందికి పైగా ప్రయాణికులతో లండన్‌లోని హీత్రూ నుంచి సోమవారం ఉదయం బెంగళూరుకు చేరుకుంది. విమానం ఎడమవైపు ఇంజిన్ 'రన్' నుంచి 'కటాఫ్'కు మారిపోయిందని, దానిని లాక్ చేయడం వీలు కావడం లేదని పైలట్ సమాచారం ఇచ్చారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా విమానాన్ని నిలిపివేసి, ఆ లోపాన్ని అత్యవసరంగా సరిచేయాల్సిందిగా తయారీదారుల్ని కోరామని ఎయిరిండియా తెలిపింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన శాఖకు, డీజీసీయేకు తెలియజేశామని వెల్లడించింది. అన్ని బోయింగ్ 787 విమానాల ఇంధన నియంత్రణ స్విచ్‌లను తనిఖీ చేశామని, అవి బాగానే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఇదే సంస్థకు చెందిన ఇదే రకం విమానం.. టేకాఫ్ సమయంలో ఇంధన సరఫరా ఆగిపోయి కూలిపోవడంతో 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజా ఘటనలోనూ విమానం బయల్దేరినచోటే సమస్య తలెత్తినట్లు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) చెబుతోంది. దానివల్ల విమానం గాలిలో ఉంటుండగా ఇంజిన్ ఆగిపోయే ప్రమాదం సంభవించవచ్చని తెలిపింది.

# దలైలామాకు గ్రామీ అవార్డు

- మొదటి పేజి తరువాయి

90 ఏళ్ల టిబెట్ ఆధ్యాత్మిక గురువు అయిన దలైలామాకు గోల్డెన్ గ్రామోఫోన్ దక్కడం ఇదే తొలిసారి. ఆదివారం రాత్రి లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టోడాట్‌కామ్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 90 కేటగిరీలో అవార్డులను ప్రకటించారు. దలైలామాకు అవార్డు దక్కడంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. దలైలామా తరఫున గాయకుడు రఫూస్ వెయిన్‌రైట్ అవార్డును స్వీకరించారు. 'ఆడియో బుక్స్, నరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్' కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. గాయకులు మ్యాగీ రోజర్స్, ఆండ్రా డేతో కలిసి దలైలామా ఈ ఆల్బమ్ రూపకల్పనలో పాలుపంచుకున్నారు. కబీర్ సెహగల్ నిర్మించిన ఈ ఆల్బమ్‌లో సరోద్ విద్వాంసుడు అంజాద్ అలీ ఖాన్, ఆయన కుమారులు అమాన్ అలీ బంగాష్, అయాన్ అలీ బంగాష్, అమెరికా శాక్సాఫోన్ విద్వాం సుడు టెడ్ నాష్, గాయకుడు, గేయ రచయిత డెబీ నోవా తదితరులు కనిపించారు. అవార్డు ను తాను వ్యక్తిగత ఘనతగా భావించడం లేదని, దానిని కృతజ్ఞతతో, మానవత్వంతో స్వీకరిస్తున్నానని, అంతర్జాతీ యంగా నిర్వహిస్తున్న బాధ్యతలకు వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని దలైలామా తెలిపారు. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తప్పుబట్టింది. తమ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయనకు అవార్డు ఇవ్వడాన్ని

వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది. మతం పేరుతో ఆయన విభజన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ వ్యాఖ్యానిం చారు. 'ఆయనో రాజకీయ శరణార్థి. మతం పేరుతో చైనాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు' అని పేర్కొన్నారు.

## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

:హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## రాహుల్ Vs రాజ్ నాథ్ లోక్ సభలో మాటల యుద్ధం

సభలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లా డుతున్నారని అమిత్ షా మండిపడ్డారు. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ..వార్తాపత్రి కల క్లిప్పింగులు,ప్రచురణ కాని పుస్తకాల కు సంబంధించిన విషయాలను లోక్సభలో ప్రస్తావించకూడదని రూల్ బుక్ నియ మాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్ర సంగంపై, ధన్యవాదాలు చెప్పేతీర్మానంపై మాట్లాడాలని రాహుల్క సూచించారు. మరోవైపు రాహుల్ మాట్లాడుతుండగా

మైక్ కట్ చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. "1959, 1962లో చైనా చేత దోచబడిన భూభాగాన్ని కాంగ్రెస్ పార్టీ తిరిగి తెచ్చుకోగలదా?" అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ నిబంధనలు ఉల్లంఘించి, స్పీకర్ నిర్దే శించిన తర్వాత కూడా అదే అంశాన్ని మళ్లీ మళ్లీ ఉటంకించారని రిజిజూ ఆరోపించారు.

## షేక్ హసీనాకు 10 ఏళ్ల జైలుశిక్ష

- మొదటి పేజి తరువాయి

ప్రాజెక్టు కింద ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న అభియోగాలతో హసీనాకు, ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్దిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్దిక్, అజ్మీనా సిద్దిక్ సహా మరికొంతమందికి కోర్టు జైలు శిక్ష విధించింది. బ్రిటన్‌లో ప్రస్తుతం లేబర్ పార్టీ ఎంపీగా ఉన్న తులిప్ సిద్దిక్‌కి కోర్టు 4 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. రద్వాన్, అజ్మీనాలకు ఏడేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. వీరందరికీ లక్ష టాకాల చొప్పున జరిమానా కూడా విధించింది. దాన్ని చెల్లించకపోతే మరో 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది.

## దిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం

- మొదటి పేజి తరువాయి

అపాయింట్‌మెంట్ తీసుకుని దిల్లీ వచ్చిన బెంగాల్ సీఎం, టీఎంసీ అగ్రనేత మమతా బెనర్జీ ఈసీతో, దిల్లీ పోలీసులతో ఘర్షణకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో సోమవారం సాయంత్రం భేటీ అయిన మమత ఆ సమావేశం నుంచి అర్ధంతరంగా వాకౌట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జ్ఞానేశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అహంకారపూరితంగా వ్యవహరించారని, తమ ప్రతినిధులను అవమానించారని ఆరోపించారు. సర్ కసరత్తుతో పలువురు ప్రాణాలు కోల్పోయినా ఈసీ పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. భాజపా దళారిగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ధ్వజమెత్తారు. ఇక ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు. మమతా బెనర్జీ ఆరోపణలను సీఈసీ తోసిపుచ్చారు. టీఎంసీ ప్రతినిధులకు సమాధానం చెబుతుండగానే మమత ఆగ్రహంతో భేటీ నుంచి వెళ్లిపోయారని తెలిపారు. అంతకుముందు దిల్లీలోని బంగ భవన్ వద్ద భారీ స్థాయిలో పోలీసుల మోహరింపుపై మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వారితో ఘర్షణకూ దిగారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 'సర్' బాధితులు దిల్లీలోని బెంగాల్ ప్రభుత్వ భవనాల్లో బస చేశారు. చాణిక్యపురిలోని బంగ భవన్ ప్రాంగణంలో మోహరించిన దిల్లీ పోలీసులతో మమత వాగ్వాదానికి దిగారు.

## వైకాపా వారి ఉచ్చులో పడొద్దు

-మొదటిపేజీ తరువాయి

చూస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించి అభివృద్ధి చేయాలనేదే మన ప్రధాన ఎజెండా. దీన్ని చెడగొట్టేందుకు వైకాపా వాళ్లు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరతాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**బలమైన బ్రాండ్ ఇమేజ్ మనకుంది**

పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు పార్టీ కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చట్టాన్ని గౌరవించేవారిగా తెదేపా నాయకులు, కార్యకర్తలకు బలమైన బ్రాండ్ ఇమేజ్ ఉందని పల్లా తెలిపారు. చట్టాల్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన మార్గం కాదని పేర్కొన్నారు. తెదేపాకు నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని స్పష్టం చేశారు. 'సోషల్ మీడియాలో జరుగుతున్న అన్ని ప్రచారాలకూ స్పందించాల్సిన అవసరం లేదు.

ఆదివారం రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనలపై మన అధినేత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో వైకాపా నేతలు చట్టాల్ని కాలరాస్తూ.. అరాచక పాలన చేశారు. అప్పట్లో దాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాం. ఇప్పుడు మనమే చట్టాల్ని చేతుల్లోకి తీసుకోవడం తగదు' అని ఆయన వివరించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన మేలును క్షేత్రస్థాయిలో వివరించాలని పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలకు నిర్దేశించారు.

**నీచ కుట్రలకు తెరలేపారు: అచ్చెన్నాయుడు**

సీనియర్ నేత, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైకాపా నేతలు నీచ కుట్రలకు తెరలేపారని దుయ్యబట్టారు. 'వైకాపా నాయకుల దుర్భాషలు అసహ్యం కలిగిస్తున్నాయి. సీనియర్ నాయకులు కూడా జుగుప్సాకరంగా మాట్లాడటం సిగ్గుచేటు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే సరైన మార్గం. దాడులు, హింస తెదేపా సంస్కృతి కాదు. వైకాపా వాళ్ల ఉచ్చులో పడకుండా ఓపికతో వ్యవహరించాలి. రాష్ట్రానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడాలి. ఇప్పటికే రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలని వాళ్లు చేసిన కుట్రల్ని సమర్థంగా ఎదుర్కొన్నాం' అని ఆయన తెలిపారు.

# చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే ప్రత్తిపాటి.

## సూర్యచంద్రులు గతి తప్పరన్నది ఎంత నిజమో చంద్రబాబు తప్పు చేయరన్నది అంతే నిజం.



**చిలకలూరిపేట, పెన్ సత్తా, పిబ్రవరి 02:** అధికార పొగరుతో నాడు జగన్ టీడీపీ పై మోపిన నేరాభియోగాలు, తప్పుడు కేసులు నేడు విచారణ సంస్థల సమగ్ర దర్యాప్తుతో పటాపంచలు అవుతున్నాయి, కల్తీ నెయ్యి కేసు తనకు, తన పార్టీకి భారీ డిఫెక్ట్ అవుతుందనే జగన్ అంబటి, జోగిలను చంద్రబాబు, లోకేష్ లపైకి ఉసిగొల్పాడు అని మాజీమంత్రి ప్రత్తిపాటి అన్నారు. సోమవారం పత్రికల వారితో ప్రత్తిపాటి మాట్లాడుతూ పక్కా పథకం, ప్రణాళికతో తన విద్వేష రాజకీయాల్లో భాగంగా, అధికారంలో ఉన్నానన్న పొగరుతో నాడు జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు సహా, నాతోపాటు పార్టీ ప్రధాన నాయకుల పై మోపిన అభియోగాలు, తప్పుడు కేసులు నిలబడవని నాడే చెప్పాం అన్నారు. కాలగమనంలో జగన్ కపట రాజకీయాలు దూదిపింజల్లా తేలిపోతాయని అప్పుడే ప్రజలకు తెలియచేశాం అన్నారు. టీడీపీ నిర్మూలనే లక్ష్యంగా, వైకాపా ప్రభుత్వం నిరాటకంగా ఐదేళ్లపాటు సాగించిన కక్ష సాధింపులు, కుట్రలు నేడు విచారణ సంస్థల సమగ్రదర్యాప్తులో పటాపంచలవుతున్నాయన్నారు. స్కిల్ కేసు విచారణలో భాగంగా నాడు సిట్ చంద్రబాబు పాత్రకు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీనేతలు, నేడు ఈడీ క్లీన్ చిట్ కు ఏం వక్రభాష్యాలు చెబుతారు అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే అన్నది జగమెరిగిన సత్యం, సూర్యచంద్రులు గతితప్పరు అన్నది ఎంత నిజమో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పు చేయరు అన్నది అంతే నిజం అని వత్తి వక్కాణించారు. ఈ వాస్తవం గ్రహించకుండా నాడు అధికార మదంతో జగన్ తన అవినీతి మకిలను చంద్రబాబుకు ఆపాదించే ప్రయత్నం చేసి, కొరివితో తల గోక్కున్నాడన్నారు.కల్తీ నెయ్యి కేసు ఎఫెక్ట్, తనకు డిఫెక్ట్ కాకూడదనే జగన్ అంబటి, జోగిలను ఉసిగొల్పాడు. కుట్ర కుతంత్రాలు, విద్వేష విధ్వంసాలే కేంద్రంగా, రాష్ట్ర వినాశనమే లక్ష్యంగా జగన్ సాగిస్తున్న క్రిమినల్ పాలిటిక్స్ ను ప్రజలు ఎప్పటికీ విశ్వసించరని మరోసారి రుజువైంది. కూటమి ప్రభుత్వ సుస్థిరపాలన, సమగ్రాభివృద్ధికి అడ్డుకట్ట వేయడం, పెట్టు బడులు ఆకర్షణలో రాకెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న చంద్రబాబును నిలువరించడం జగన్ తరం కాదన్నారు. కల్తీనెయ్యి వ్యవహారం ఎఫెక్ట్ తనకు, తన పార్టీకి భారీ డిఫెక్ట్ కాకూడదనే తన మురికి రాజకీయాల్లో భాగంగానే జగన్ ఉన్నపళంగా మాజీ మంత్రులు అంబటి, జోగిలను చంద్రబాబు, లోకేష్ లపైకి ఉసిగొల్పాడు అని. ఈ వాస్తవం ప్రజలు గ్రహించారు కనుకే టీడీపీశ్రేణుల ఆగ్రహానికి జతకలిసి, వైసీపీ శ్రేణుల కవ్వింపు చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టారు.

లిబడ్జెట్లో చంద్రబాబు సంకల్ప సాకారానికి మోదీ తనవంతు సహకారం అందించారు..లివిజన్ -2047 లక్ష్యసాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు, ఆవిష్కరణలకు కార్యరూపమిచ్చేలా తాజా బడ్జెట్ లో ఏపీకి కేటాయింపులు జరిగాయి. హైస్పీడ్ రైల్ కారిడార్లు, తయారీ రంగాలకు ప్రోత్సాహకాలు, ఎం.ఎస్.ఎం.ఈల బలోపేతానికి సహకారం వంటి నిర్ణయాలతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చారు. బడ్జెట్లో దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన మోదీ దూరదృష్టి.. చంద్రబాబు భవిష్యత్ సంకల్పాన్ని తప్పకుండా సాకారం చేస్తుంది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

# వేసవిలో తాగునీటి సమస్య తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోండి.





### ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో మంత్రి సవిత సమీక్ష.

**పెనుకొండ, పెన్ సత్తా, పిబ్రవరి 02:** పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని పెనుకొండ నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఏర్పడితే వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆర్డబ్ల్యూ శ్రీనివాస్ 5 మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు. అనంతరం పెనుకొండ మున్సిపాలిటీ కమిషనర్‌తో పాటు ఇతర మున్సిపల్ అధికారులతో మంత్రి సవిత మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, శానిటేషన్ పనుల పురోగతి పై విస్తృతంగా చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు కాపాడాలని, ప్రతి వార్డులో నిరంతర పర్యటనలు నిర్వహించి ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సవిత సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి నేతల పై పోలీసులకు పిర్యాదు చేసిన అన్నంరెడ్డి అదీప్ రాజ్.





**పెందుర్తి, పెన్ సత్తా, పిబ్రవరి 02:** మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ అధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి పెందుర్తి పోలీసు స్టేషన్ లో సిఐ సతీష్ కుమార్ కి కూటమి నేతల పై పిర్యాదు చేశారు. సోమవారం పిర్యాదు అనంతరం అదీప్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నేతలు కనుసన్నల్లో హిందువులు, ప్రజలు మనోభావాలను కించపరిచేలా ఫ్లెక్సీలను పెడుతున్నారు అన్నారు. ఆ ఫ్లెక్సీ లలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్, వై వి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి ఫోటోలను వేసి వారిమీద ఆరోపణలను చేస్తున్నారన్నారు. దీని పైన ప్రశ్నిస్తున్న మా నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని, బ్రహ్మనాయుడు ల పైన భౌతిక దాడులు, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు అన్నారు. ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలును కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగంతో నడుపిస్తున్నది అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా పరిశీలకులు సరగడం చిన అప్పల నాయుడు, పరవాడ జడ్పీటీసీ పయిల సన్యాసి రాజు, మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను, వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు (95), దాసరి సత్తిబాబు (93),తమర్ల నర్సింగ్ రావు (94), మెంతి మహేష్ (97), అప్పికొండ మహాలక్ష్మీ నాయుడు (88), మాజీ పాక్స్ చైర్మన్ గొర్ల రాము నాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు, సీనియర్ నాయకులు పీతల విష్ణు, కోన శ్రీను, గొంప అప్పారావు, మళ్ళ నూక అప్పారావు, రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి ఐడి బాబు, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కోరాడ చందు యాదవ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్, జిల్లా ఐటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ యాదవ్, సన్నీ, మహేష్, ఎర్రయ్య, జగదీష్, మువ్వల శ్రీను, ఆకుల వాసు, వేపాడ శ్రీను, గోవింద్, వర్మ,రాంబాబు, రజిని, ప్రసన్న, అనిత తదితరులు ఉన్నారు.

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### సమస్యలను జిల్లా ఎస్పీ కి విన్నవించుకున్న 62 మంది అర్జీదారులు

**బాపట్ల,పెన్ సత్తా, ఫిబ్రవరి 2 :**బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బీ ఉమామహేశ్వర్ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద అర్జీలను స్వయంగా స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 62 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ కు విన్నవించుకున్నారు.అర్జీదారుల సమస్యలను కూలంకుషంగా విన్న ఎస్పీ బీ ఉమామహేశ్వర్ వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.



# అంబటి, జోగి వ్యాఖ్యలు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే.

- ఏపీలో అభివృద్ధిని చూసి తట్టుకోలేక వైసీపీ కుట్రలు.
- దోచుకునే వారికి, దాచుకునే వారికి బడ్జెట్ అర్థమవుతుందా?.
- బడ్జెట్ పై వైసీపీ నేతలకు కనీస అవగాహన లేదు.
- ఢిల్లీ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అనకాపల్లి ఎంపీ ధ్వజం.



అనకాపల్లి, పెన్ సత్తా, పిబ్రవరి 02:ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సమగ్ర అభివృద్ధిని చూసి తట్టుకోలేకే వైసీపీ నేతలు కావాలనే డైవర్షన్ రాజకీయాలకు దిగుతున్నారని సోమవారం ఢిల్లీ వేదికగా బీజేపీ ఆంధ్రప్రదేశ్ ఎంపీలు నిర్వహించిన మీడియా సమావేశంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సి.యం రమేశ్ తీవ్రంగా విమర్శించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా రెచ్చగొట్టే విధంగా ఉండటంతో పాటు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల తోనే ఇటువంటి వ్యాఖ్యలు వెలువడుతున్నాయని ఆరోపించారు. ఏపీలో శాంతి భద్రతలు ఉన్నాయా లేదా అన్న విషయం కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా తెలుసని, గత మూడు రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను కేంద్రం నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే వైసీపీ ఈ విధమైన రాజకీయాలకు పాల్పడుతోందని మండి పడ్డారు. జగన్ డిస్ట్రక్టివ్ మోడ్‌లో పనిచేస్తుంటే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రం కన్స్ట్రక్టివ్ మోడ్‌లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏపీలో సుపరిపాలన కొనసాగుతోందని, కేంద్ర మరియు రాష్టం సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను సీఎం చంద్రబాబు సమర్థవంతంగా కాపాడుతున్నారని స్పష్టం చేశారు. అదే సమయంలో ఏపీలో ఉన్న వైసీపీ నేతలకు బడ్జెట్ పై కనీస అవగాహన కూడా లేదని విమర్శించారు. ఎప్పుడూ దోచుకోవాలి, దాచుకోవాలనే ఆలోచనలే తప్ప ప్రజల అభివృద్ధి వారికి పట్టదని ఘాటు వ్యాఖ్యలు చేస్తూ ముందు బడ్జెట్‌ను పూర్తిగా చదివి వాస్తవాలు తెలుసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

- కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్నవారే ప్రత్యక్ష దైవం.
- మంచి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును గుర్తు పెట్టుకోండి
- నియోజకర్గంలో 231 మందికి చెక్కులను పంపిణీ చేసిన సింధూర రెడ్డి.





**పుట్టపర్తి, పెన్ సత్తా, పిబ్రవరి 02:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం లోని 28 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.15,48,425 ల ఆర్థిక చెక్కులను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 231 మందికి రూ.2 కోట్ల 37 లక్షల 73 931 రూపాయలను పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆర్థికంగా ఆదుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ఇంటి పెద్ద కొడుకుగా కొంత ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజలను కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొంది లక్షలాది రూపాయలు వెచ్చించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ఆర్థిక చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండకర్ల ఆవను పర్యావరణ హితంగా ఉంచాలి.

- ఆవ పరీవాహక ప్రాంతంలో ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి.
- ఇళ్ళ వ్యర్థాలు ఆవ లోనికి రానీయకూడదు.
- ఆవలో ఆక్రమణలు తొలగించాలి.
- బొలిశెట్టి సత్యన్నారాయణ, జనసేన రాష్ట్ర పర్యావరణ ప్రధాన కార్యదర్శి.





**అచ్యుతాపురం, పెన్ సత్తా, పిబ్రవరి 02:**కొండకర్ల ఆవను పర్యావరణ హితంగా ఉంచాలి అని జనసేన పార్టీ రాష్ట్ర పర్యావరణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యన్నారాయణ పిలుపు నిచ్చారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం అచ్యుతాపురం మండలం, కొండకర్ల ఆవను సందర్శించిన తర్వాత ఆయన ప్రజలతో మాట్లాడారు. ఆవ విస్తీర్ణం సుమారు 1,863 ఎకరాలను పరి రక్షణ బాధ్యత ప్రభుత్వానిది, దాని మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలదీ అన్నారు. అలాగే ఆవ పరీ వాహక ప్రాంతం సుమారు 2,538.19 హెక్టార్లలో ప్రకృతి ఆధారంగా పంటలు పండించేలా ప్రభుత్వం కృషి చేయాలి అని కోరారు. ఇళ్ళ నుండి, గ్రామాలు, పట్టణాలు, పారిశ్రామిక వ్యర్థాలు ఆవ లోనికి రానీయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆవలో ఆక్రమణలు తొలగించాలని, కొత్త ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనకాపల్లి జిల్లా లోని ఈ కొండకర్ల ఆవ ఆంధ్రప్రదేశ్‌లో కొల్లేరు సరస్సు తర్వాత రెండవ అతిపెద్ద సహజ మంచినీటి సరస్సుగా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో విస్తరించి ఉన్న ఈ సరస్సును వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా "సంరక్షిత ప్రాంతం"గా ప్రకటించిందని అన్నారు."ఆవ" అంటే తెలుగులో చిత్తడి నేల లేదా సరస్సు అని అర్థం. ఇది కేవలం నీటి వనరు మాత్రమే కాదు, చుట్టు పక్కల ప్రాంతాలకు వరద ముప్పును తగ్గించే సహజ సంతులన కర్త అని, కొండకర్ల ఆవ అత్యధికంగా కార్బన్ డయాక్సైడ్ తీసుకుని ఆక్సిజన్ ను విడుదల చేస్తుందని వివరించారు. మనిషికి కిడ్నీ ఎంత ముఖ్యమో భూమికి ఈ ఆవ అంత ముఖ్య మైనది అని పేర్కొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణ భద్రత

- ఆనందపురంలో ఓ ఎస్ జి ఫౌండేషన్ అవగాహన ర్యాలీ.



**ఆనందపురం, పెన్ సత్తా, పిబ్రవరి 02:**సమాజంలో ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యమని, రహదారి ప్రమాదాలను తగ్గించాలంటే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఓ ఎస్ జి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ దళాయి పిలుపు నిచ్చారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత పై అవగాహన పెంపొందించడం అవసరమని, ఇందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. సోమవారం ఉదయం ఆనందపురం జంక్షన్ వద్ద ఓ ఎస్ జి ఫౌండేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించాలంటే వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మితిమీరిన వేగాన్ని నియంత్రించాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ ఎస్ ఐ శివ, ట్రాఫిక్ ఎస్ ఐ పాపారావు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో రహదారి భద్రతపై చైతన్యం కల్పించేందుకు ఓ ఎస్ జి ఫౌండేషన్, గ్రామీణ వైద్యుల సంఘం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పితల గోవింద్, చల్ల రామిరెడ్డి, యారంశెట్టి సంతోష్, పైడిరాజు, జోనల్ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, సహాయ కార్యదర్శి కె. నారాయణరావు, వినోద్, పి. సుధాకరరెడ్డి, రఘు, శ్రీనివాస్, శ్రీ వెంటేశ్వర స్కూల్ ప్రిన్సిపాల్ వంశీ, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

# వైభవంగా తిరుపతమ్మ తల్లి జలబిందెల మహోత్సవం



మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు.




**గన్నవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తల్లి పెద్ద తిరునాళ్లలో భాగంగా సోమవారం అమ్మవారి జలబిందెల మహోత్సవాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకోగా, పోలీస్ సిబ్బంది వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ఆచారం ప్రకారం ఈ జలబిందెలను పోలీస్ స్టేషన్ లోకి తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న యార్లగడ్డ దంపతులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వికలాంగుల వద్దకే వెళ్లి అర్జీల స్వీకరించిన కలెక్టర్ కృతిక శుక్లా




**పల్నాడు, పెన్ సత్తా, పిబ్రవరి 02**: జిల్లా సాధారణంగా ప్రజలు తమ సమస్యల విన్నపం కోసం అధికారుల చుట్టూ తిరుగుతుంటారు. కానీ, అందుకు భిన్నంగా పల్నాడు కలెక్టర్ స్వయంగా వికలాంగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి బాధితులు తరలివచ్చారు. అందులో పలువురు దివ్యాంగులు, వృద్ధులు ప్రాంగణం లోనే వేచి ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. ప్రోటోకాల్ పక్కన పెట్టి, స్వయంగా కిందకు దిగి వచ్చిన కలెక్టర్ అక్కడ ఉన్న వికలాంగుల వద్దకు వెళ్లి కూర్చుని వారి అర్జీలను స్వీకరించి తన ఉదారతను చాటారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్న ఆమె, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వృద్ధురాలికి ఇంటి స్థలం మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా. జిల్లా లోని రావిపాడు గ్రామానికి చెందిన మేడా రాములమ్మ అనే వృద్ధురాలికి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా 2.5 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేశారు. కలెక్టరేట్ లో ఇంటి స్థలం పట్టాను వృద్ధురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సంజనా సింహ్, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాల్ లు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యల పై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు.




- భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి.
- పి జిఆర్.ఎస్ కు-215, రెవెన్యూ క్లినిక్ కు- 276 అర్జీలు డి.అర్వో

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 02**: భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని. పి జి ఆర్ ఎస్ కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం-1 , 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమలలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ, బి జె ఆర్ ఎస్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామమణి లు జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా డివిజను, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అన్నారు. అర్జీదారులు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయి లోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్ లో 215మరియు రెవిన్యూ క్లినిక్ లో 276 అర్జీలు మొత్తం 491 అర్జీలు స్వీకరించడం జరిగిందని డి.అర్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, బి జె ఆర్ ఎస్, ఎన్ ఎ ఓ బి, ఎ పి ఐ ఐ సి, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, మనోరమ, రామ మాణి, అనిత, డి ఆర్డి ఎ, మెప్మా, ఐ సి డి ఎస్, శచి దేవి, కె సరోజినీ, సూర్య లక్ష్మి, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి సుదీర్, జిల్లా రవాణా శాఖ అధికారి జి మనోహర్, జిల్లా సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 129 వినతులు.





జీవీఎంసీ అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 129 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు ఎస్.ఎస్.వర్మ తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 129 అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 06, మధురవాడ జోన్ కు 13, ఈస్ట్ జోన్ కు 29, వెస్ట్ జోన్ కు 05, నార్త్ జోనుకు 15, సౌత్ జోన్ కు 15, పెందుర్తి జోన్ కు 13, అగనంపూడి జోన్ కు 03, గాజువాక జోన్ కు 17, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 09, రెవెన్యూ విభాగమునకు 14, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 58, ఇంజినీరింగు విభాగమునకు 33, మొక్కల విభాగమునకు 04, యుసిడి విభాగమునకు 03 కలిపి మొత్తంగా 129 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్లు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను, ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసీపీ లు, ఏసీపీ లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ కృపావరం, ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసినాయుడు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# అంబటి వ్యాఖ్యలు నీచమైనవి

- తప్పు చేసిన వ్యక్తి అందుకు తగ్గ శిక్ష అనుభవిస్తుంటే కులం ఎందుకు వస్తుంది.
- నెయ్యి లో కల్తీ చేయలేదు అని అలిపిరి మెట్ల మీద వైసీపీ నేతలు ప్రమాణం చేయగలరా?.
- ఇది అంతా తిరుమల తిరుపతి నెయ్యి కల్తీ అంశం నుండి ప్రజల దృష్టి మరల్చడానికే.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఉద్దేశించి మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన నీచమైన వ్యాఖ్యలు, దాని అనంతరం వైసీపీ ఈ మొత్తం అంశాన్ని కాపు, బీసీ కులాల పై దాడి అంటూ తప్పుదారి పట్టిస్తున్న అంశం పై, అలాగే తిరుమల తిరుపతి లడ్డు అంశం లో నెయ్యి కల్తీ పై వైసీపీ చేస్తున్న ఒక బూటకపు వాదనని జనసేన కాపు నాయకులతో కలిసి మీడియా సమావేశంలో ఖండించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి, అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు పత్రికాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపి, 83 వ వార్డు ఇంచార్జి మంగా ఈశ్వర్, సి. హెచ్. ఎన్. అగ్రహారం పిఏసిఎస్ బ్యాంకు చైర్మన్ బంటు రవి, అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ మాట్లాడుతూ అంబటి రాంబాబు నీచంగా చంద్రబాబు నాయుడు ని తిడితే తప్పు అయింది అని క్షమాపణ చెప్పకుండా దానిని కాపు కులం మీద జరిగిన దాడి అంటూ వైసీపీ నీచమైన వాదన చేస్తుంది అని, కాపులు ఎవ్వరు దీనిని హర్షించరు అని అన్నారు. తప్పు చేసిన వ్యక్తి శిక్ష పడుతుంటే కులం ఎందుకు ఆపాదిస్తున్నారు అని అన్నారు. రాష్ట్రంలో అల్లర్లు జరిగే విధంగా పరిస్థితి ని మార్చాలి అని వైసీపీ చూస్తుంది అన్నారు. అస్సలు కాపులు అంటే వైసీపీ కి చాలా చులకన అని అందుకే తప్పు చేసిన ప్రతిసారి కాపు కులాన్ని వాడుకుంటున్నారు అని అన్నారు. అస్సలు తిరుమల తిరుపతి లడ్డు నెయ్యి లో కల్తీ అంశం బయటకి వస్తుంది అని వైసీపీ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారు అన్నారు. ఎన్డీడీబీ ఇచ్చిన రిపోర్ట్ లో నెయ్యి లో జంతువుల కొవ్వు ఉంది అని రిపోర్ట్ ఇచ్చింది అని, ఇప్పుడు సిట్ రిపోర్ట్ లో ఐతే జంతువులు కొవ్వు తక్కువ శాతం ఉన్న కూడా అస్సలు పాలు, పెరుగు వాడకుండా కేవలం మోనోగ్లిజరైడ్ వంటి రసయనాలు వాడి దీన్ని తయారు చేసారు అని రిపోర్ట్ లో తేలింది అని అన్నారు. 2019 - 2024 వరకు 1.61 లక్షల కిలోల నెయ్యి కొనుగోలు చేస్తే అందులో 60 లక్షల కిలోలు కేవలం కల్తీ నెయ్యి ఉంది అని, దీనితో 20 కోట్ల లడ్డులు తయారు చేసి స్వామి ప్రసాదంతో వైసిపి ప్రభుత్వం ఆటలు ఆడింది అని అన్నారు. పాప ప్రక్షాళన పేరుతో జగన్ రెడ్డి, వైసీపీ నేతలు యాత్రలు చేయాలనీ పిలుపు ఇస్తున్నారు అని, సిట్ వైసీపీ నేతలకు క్లీన్ చిట్ ఇచ్చింది అని చెప్పుకుంటున్నారు అని, అస్సలు వైసీపీ నెయ్యి లో కల్తీ చేయలేదు అని మొన్న పత్రికా సమావేశాలు పెట్టిన అమర్నాథ్ కానీ, జగన్ రెడ్డి కానీ, వైవీ సుబ్బారెడ్డి కానీ అలిపిరి మెట్ల మీద ప్రమాణం చేసి చెప్పగలరా అని వీరు అడిగారు. వెంకటేశ్వర స్వామి తో ఆటలు ఆడుకోవొద్దు అని, ఆలా ఆడుకోవాలని చుస్తే గతంలో ఏమైందో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలి అని అన్నారు. కచ్చితంగా ప్రజలు కానీ, భగవంతుడు కానీ దీనికి తగిన శిక్ష వేస్తారు అని అన్నారు. ఇలాంటి పనులు చేయడం వల్లే 151 నుండి 11 కి పరిమితం అయ్యారు అని, అయినా మిలో మార్పు లేదు అని, భవిష్యత్తు లో అది కూడా మిగలదు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో, విల్లూరి హరికృష్ణ, చదరం నాగేశ్వరావు, ఆళ్ల రామచంద్ర రావు, బుద్ధ శ్రీను, బర్నికానా రాము, గంగుపాం జగదీశ్, సింహాద్రి, కొణతాల మాధవ్ పాల్గొన్నారు.

# సార్ మా పంచాయతీ కార్యాలయం కనబడడం లేదు.

ఆచూకీ తెలియపరచవలసిందిగా కోరుకుంటున్నాం.

అనకాపల్లి జిల్లా డిపిఓ, రాంబిల్లి ఎం.పి.డి.ఓ. పై చర్యలు తీసుకోవాలి.

మంగళగిరి జనసేన పార్టీ ఆఫీస్ జనవాణి లోని డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు.

**మంగళగిరి, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** అనకాపల్లి జిల్లా లోని, రాంబిల్లి మండలం, అప్పారాయుడు పాలెం పంచాయతీ ప్రభుత్వ రికార్డుల్లో తప్ప భౌతికంగా కనిపించడం లేదు అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి సోమవారం ఉదయం మంగళగిరి జనసేన పార్టీ ఆఫీస్ జనవాణి లో నానేపల్లి సన్యాసి రావు పిర్యాదు చేసారు. ఈ విషయం పై అనకాపల్లి జిల్లా డిపిఓ, అలాగే రాంబిల్లి మండలం ఎంపీడీవో పైన చర్యలు తీసుకోవాలి అని అప్పారాయుడుపాలెం గ్రామస్తులు తరుపున నానేపల్లి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నానేపల్లి సన్యాసి రావు మాట్లాడుతూ 2020 లో మా అప్పారాయుడు పాలెం, భోగాపురం రెండు గ్రామలు అధికారికంగా అప్పారాయుడు పాలెం పంచాయతీగా ఏర్పడినప్పటికీ, అప్పారాయుడు పాలెం గ్రామ పంచాయతీ ప్రాథమిక స్థాపన గాని, నిర్వహణ గాని, గ్రామ పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయడం గాని లేదు అన్నారు. గ్రామానికి పంచాయతీ కార్యదర్శి నియామకం లేదు, కనీసం పంచాయతీ కార్యాలయం పేరు తో బోర్డు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 13-01-2020 తేదీన ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ జీవో నెంబర్ 186/2020 కూడా జారీ చేసిందని అన్నారు. 2020 సంవత్సరం నుండి అప్పారాయుడు పాలెం ప్రత్యేక పంచాయతీగా అన్ని రికార్డులలో పరిగణించ బడుతోంది, ప్రత్యేక గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతా అచ్యుతాపురం లోని యూనియన్ బ్యాంక్ 04-12-2021 తెరవబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు 15 వ ఆర్థిక సంఘం కింద గ్రాంట్లతో సహా ఈ బ్యాంక్ ఖాతాకు జమ చేయబడ్డాయని, 2020-21 ఆర్థిక సంవత్సరం నుండి అప్పారాయుడు పాలెం పంచాయతీ కోసం ఆడిట్-నివేదికలు తయారు చేయబడ్డాయని అన్నారు. పైన చెప్పిన ఈ అధికారిక చర్యలు కాగితం పై ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని అన్నారు. పంచాయతీ ఏర్పాటు కానీ, పూర్తి స్థాయి కార్యదర్శి నియామకం చేపట్టలేదని, కనీసం పంచాయతీ పేరుతో బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అత్యంత దయనీయమని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తూ అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారన్నారు. పంచాయతీ కార్యదర్శి నియామకంలో పంచాయతీ నేమ్ బోర్డ్ ను ఏర్పాటు చేయడంలో కూడా తీవ్రమైన పరిపాలనా నిర్లక్ష్యం వహించినందుకు గాను అనకాపల్లి జిల్లా డిపిఓ, రాంబిల్లి ఎం.పి.డి.ఓ. పై చర్యలు తీసుకోవాలని ఈ లేఖలు పేర్కొన్నారు. అన్ని విధాలుగా అప్పారాయుడు పాలెం పంచాయతీని అభివృద్ధి చేసే విధంగా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ న్ని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ని కోరునట్లు తెలిపారు. ఈ సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్ ఓ.ఎస్.డి మాట్లాడుతూ తొందరగా అప్పారాయుడు పాలెం పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విధంగా చూస్తామని తెలిపారు.



## వర్కింగ్ జర్నలిస్టులకు వారం రోజుల్లో ఆరోగ్య పరీక్షలు.

- బస్సు పాసులు రెన్యువల్ కు ఆదేశాలు.
- అర్హులందరికీ అక్రిడేషన్లు.
- ఫెడరేషన్ నేతలతో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** విశాఖ జిల్లా లోని వర్కింగ్ జర్నలిస్టులకు వారం రోజుల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ తెలిపారు.సోమవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ ఏ జె )ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ ను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల కాలంలో పలువురు జర్నలిస్టులు ఖరీదైన వైద్య పరీక్షలు చేయించు కోలేకపోతున్నారని, అలాగే మెరుగైన వైద్యం పొందలేక పోతున్నారని కలెక్టర్ కు వీరు వివరించారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి వారం రోజుల్లోనే జర్నలిస్టులకు ఆరోగ్య పరీక్షలు ప్రారంభించే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే జర్నలిస్టుల బస్సు పాసుల గడువు ముగిసిన నేపథ్యంలో కొత్త అక్రిడేషన్లు జారీ అయ్యే వరకు మరో నెల రోజులు పాటు బస్సు పాసులు రెన్యువల్ కు ఆర్టీసీ అధికారులకు లేఖ రాయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అలాగే అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్లు జారీ చేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చక్రి, సంజీవ్, రాజశేఖర్, జి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో ఫుట్ పాత్ పనులకు భూమి పూజ చేసిన బోండా జగన్నాధం.





**గాజువాక, పెన్ సత్తా, ఫిబ్రవరి 02**: నియోజకవర్గం 87 వ వార్డ్ పరిధిలో హైవే నుండి గాంధి బొమ్మ మీదగా ఆటోనగర్ సెంటర్ వరకు ఇరువైపుల ఫుట్ పాత్ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నేషనల్ హైవే నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ఇరువైపులా ఫుట్ పాత్ పనులు చేయుట కొరకు జీవీఎంసీ నిధులు సుమారు మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయించుకున్నామని, వాటిలో భాగంగా వడ్లపూడి నుండి పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. పనులు పట్ల నాణ్యత తగ్గకుండా చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బొట్టా ప్రకాష్ రాజన్ రాజు, కళ్లేపల్లి శ్రీనివాసవర్మ, గండేపల్లి రాము, ఈర్ల దేముడు, రాజు, బోండా నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్సుల కొరత పై కలెక్టర్ కి వినతి



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** జిల్లాలో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కొరత మరియు కళాశాల సమయాల్లో తీవ్ర రద్దీ కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం కళాశాల సమయాల్లో ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉండటంతో బస్సుల్లో ప్రమాదకర స్థాయిలో రద్దీ నెలకొంటోంది. దీనివల్ల విద్యార్థులు సమయానికి కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు. ఈ సమస్య పై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ వినతిపత్రంలో కళాశాల సమయాలకు అనుగుణంగా అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, అలాగే విద్యార్థులకు ఉచిత లేదా రాయితీ బస్ పాసులు అందించాలని డిమాండ్ చేయడం జరిగింది.

విద్యార్థుల విద్యా హక్కును కాపాడేందుకు అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్ఎఫ్ఐ కోరింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి అజయ్, డి వెంకటరమణ తో పాటుగా కమిటీ సభ్యులు నరేష్, భరత్, ప్రగతి, ధనుష్ ఇతర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కాగితలో రీ సర్వే భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ




**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 02 :**గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూ సురక్ష పథకంలో నిర్వహించిన రీ సర్వే చేసిన భూములకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు .సోమవారం కాగిత సచివాలయంలో సర్పంచ్ పోతంశెట్టి రాజేష్,వీఆర్వో సత్యనారాయణ లు కాగిత గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించి రైతుల సమక్షంలో పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులుకి అందజేశారు. పాస్ పుస్తకాలు తీసుకునే రైతులకు కేవైసీ నిర్వహించి పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రైతులకు సంబంధించిన భూములకు సరైన రికార్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్వహించిన సర్వేతో ఇబ్బందులు పడుతున్న రైతులకు వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూ సురక్ష పథకం ద్వారా సమగ్ర భూ సర్వే నిర్వహించి ఎంతోకాలంగా అపస్మృతంగా ఉన్న భూములకు రీ సర్వేలో రైతుల పేరున రికార్డ్ నమోదు చేయడం జరిగిందన్నారు. వీటికి సంబంధించిన పట్టాదారుపాసు పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని రాజేష్ తెలిపారు. కొంతమంది రైతుల యొక్క పాసు పుస్తకాలు ఇంకా ప్రింటింగ్ అవనందున త్వరలోనే వాటిని కూడా పంపిణీ చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని వీఆర్వో సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయుడు, సర్వేయర్ చందు, రామకృష్ణ ఉమా తదితరులు ఉన్నారు.

# అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడి అమానుషం

పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త జోగులు

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 02:** మాజీ మంత్రులు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై టిడిపి గూండాలు చేసిన దాడి అమానుషం అని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త వైసిపి మాజీ శాసనసభ్యులు కంబాల జోగులు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు కరువయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతుందన్నారు. ఇలాంటి దారుణమైన దాడులతో ఆంధ్రప్రదేశ్ మరో బీహార్ ని తలపిస్తుందన్నారు. పోలీసుల సమక్షంలోనే మాజీ మంత్రుల ఇళ్లపై కర్రలు,రాడ్లు, పెట్రోల్ బాంబులతో దాడులు జరగడం అత్యంత నీచమైన చర్యగా ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ భయాందోళనలతో ఉన్నారన్నారు. కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని రాజకీయ ప్రయోజనాల కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. లడ్డు ప్రసాదంలో ఎటువంటి కల్తీ జరగలేదని కోర్టు స్పష్టం చేయడంతో కూటమి నాయకులు చేస్తున్న ప్రచారం అసత్యమని తేలిపోయిందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వంలో ఉన్న రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాసలీలలు, వంటి ఘటనలతో రాష్ట్ర ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారని ప్రజల నుండి ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత రావడంతో వీటన్నిటి నుండి ప్రజల దృష్టి మరలించేందుకు వైసీపీ నేతలపై భౌతిక దాడులకు దిగి అరాచకం సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎవరికి శాశ్వతం కాదని ప్రభుత్వం మారితే మీరు చేసే అరాచకాలకు అదెంతలో అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజల రక్షణ, సంక్షేమంపై దృష్టి సారించాలని రాజకీయ కక్షలతో అలజడులు సృష్టిస్తే రాష్ట్ర ప్రజలందరూ తిరగబడి కూటమి ప్రభుత్వానికి చమర గీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోగులు హెచ్చరించారు.



# ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరి




జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు

**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 2 :**జిల్లాలోని పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరణ జరగాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పంచాయతీ, మునిసిపల్ రంగాలపై సమీక్షా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు సెలవుల్లో ఉన్నప్పుడు పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయంగా మరో అధికారిని వెంటనే నియమించాలని సూచించారు.మండలాల వారిగా కనీసం 75 శాతం చెత్త సేకరణ జరగాలని, త్వరలోనే 100 శాతం లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వేమూరు మండలం పెనుమర్రు పంచాయతీలో చెత్త సేకరణ సరిగా జరగకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.జిల్లాలో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా 100 శాతం అమలు చేయాలనీ ఆదేశించారు.నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని,ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదన్నారు.స్వామిత్వ సర్వే, ఆస్థి పన్ను వసూళ్లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.ట్రేడ్ లైసెన్స్ ల వసూళ్లలో జాప్యం తగదన్నారు.

# కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల మరియు హాస్టల్ కు కుర్చీలు, బకెట్ లు అందజేత

**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 2 :**బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలోని కెజీబీవి పాఠశాలకు కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16 కుర్చీలు మరియు బాపట్ల జిల్లా పర్చూరు మండలంలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాల బాలుర హాస్టల్ లోని విద్యార్థులకు 47 బకెట్ లు మరియు మగ్గులను బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ పిలుపు మేరకు కొత్తగా సోషల్ మీడియాలో ఏర్పాటు చేసిన వెబ్సైటు ద్వారా తెలుసుకొని సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. భవిష్యత్ లో కృతి ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భావన, కృతి ఫౌండేషన్ చైర్మన్ ఏ వెంకట అశ్విని,ఫౌండేషన్ స్టేట్ కో - ఆర్డినేటర్ ఉడతా చంద్రశేఖర్, బాపట్ల జిల్లా కో - ఆర్డినేటర్ టీ ఝాన్సీ కళ, చీరాల కో - ఆర్డినేటర్ మలిపెద్ది వీరబాబు, వాలంటీర్ బొమ్మిరెడ్డి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో
# జనసేన నాయకుల పూజలు



**బాపట్ల, పెన్ సత్తా, ఫిబ్రవరి 2 :**బాపట్ల పట్టణంలోని సూర్యలంక రోడ్డులో ఉన్న శ్రీ ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో సోమవారం జనసేన నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ మరియు ఉపాసన దంపతులకు కవల పిల్లలు పుట్టిన సందర్భంగా వారికి వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామి వారికి ఆకు పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు, జనసేన నాయకులు విన్నకోట సురేష్, అఖిల భారత చిరంజీవి యువత ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి విష్ణుమొలకల చంద్రబమోహన్, శీలం శ్రీనివాస్ కుమార్, జనసేన పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, జనసేన నాయకులు కారుమూరి ఆంజనేష్ నాయుడు, పసుపులేటీ మహేష్, వడ్రాణం బ్రహ్మం, విజయారావ్ నరేష్, అంకిరెడ్డి అనూష్, మాడ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.?

# ప్రాజెక్టుల భూసేకరణ పనులు పూర్తి చేయాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జ్, ఎన్నెస్పీ భూముల ఫెన్సింగ్, సింథటిక్ ట్రాక్, వెలుగుమట్ల, రోప్ వే, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్

**పెన్ సత్తా, ఫిబ్రవరి 2** అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు ప్రణాళికాబద్ధ కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ప్రాజెక్టుల భూసేకరణ, రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జ్, ఎన్నెస్పీ భూముల ఫెన్సింగ్, సింథటిక్ ట్రాక్, వెలుగుమట్ల, రోప్ వే, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మిగులు భూసేకరణ వెంటనే పూర్తీచేయాలన్నారు. యాతలకుంట కు సంబంధించి మిగులు భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణకు సంబంధించి చెల్లింపుల కై చర్యలు వేగం చేయాలన్నారు. డిజిపిఎస్ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామసభలకు ఇరిగేషన్ ఈ ఈ లు హాజరవ్వాలన్నారు. అత్యంత ప్రాధాన్యతగల ప్రాజెక్ట్ అని కలెక్టర్ అన్నారు. మున్నేరు, పాలేరు ప్రాజెక్ట్ కు సంబంధించి సర్వే జరుగుతుందన్నారు.

రిటైనింగ్ వాల్ కు సంబంధించి భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. 17 కి.మీ. ల వాల్ నిర్మాణానికి గాను 9 కి.మీ. మేర నిర్మాణం పూర్తయిందన్నారు. మిగులు భూ సేకరణలో 60 శాతం భూ యజమానులు పనులకు అంగీకారం తెలిపారని, ఆ ప్రదేశాల్లోనూ పనులు చేపట్టి పూర్తిచేయాలన్నారు. లక్ష క్యూబిక్ మీటర్ల మెటీరియల్ 5 కి. మీ. మేర వాల్ నిర్మాణానికి సిద్ధం చేశామన్నారు. ప్రొటెక్షన్ వాల్ ప్రక్కన 30 ఫీట్ల రోడ్ వస్తుందని, నగర పరిధిలో వ్యూ పాయింట్ కు ఆలోచన చేయాలన్నారు.

కేబుల్ బ్రిడ్జ్ కు సంబంధించి 75 శాతం పనులు పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ కల్లా పూర్తి నిర్మాణం జరిగేలా కార్యాచరణ చేయాలన్నారు. షాపులు కోల్పోయిన వారికి వెండర్స్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎన్నెస్పీ భూముల ఫెన్సింగ్ పాలేరు రిజర్వాయర్ నుండి వివి పాలెం వరకు 50 కి.మీ. మేర చేయాల్సివుండగా, ఇప్పటికీ 8 కి.మీ. మేర పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. ఇందులో 367 ఎకరాలు ఎన్నెస్పీ, 71 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూములున్నాయన్నారు. ఆక్రమణలకు గురయి చెరువులను గుర్తించి, తగుచర్యలు తీసుకోవాలన్నారు.

ఫ్రూట్ మార్కెట్ ఫెన్సింగ్ చేయాలని, కేటాయించిన భూమిని సంరక్షించాలని అన్నారు. ఫ్రూట్ మార్కెట్ కు 2.35 ఎకరాల స్థలం కేటాయించినట్లు, నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని తెలిపారు.

8 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేపట్టినట్లు కలెక్టర్ అన్నారు. మార్కింగ్ తో సహా అన్ని పనులు పూర్తిచేసి ఫిబ్రవరి 25 లోగా అందుబాటులోకి తేవాలన్నారు. ఫినిషింగ్ అద్భుతంగా ఉండాలని, నిర్వహణ పకడ్బందీగా చేయాలని అన్నారు. నీరు ఎక్కడ నిల్వకుండా, పడిన వర్షం నీరు పడ్డట్లే వెళ్లే విధంగా లెవల్స్ సరిగా వుండాలనారు.

క్రికెట్ స్టేడియం 20 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు, ఫిబ్రవరి 10 కల్లా మంచి ఆర్కిటెక్చర్ తో డిజైన్ చేయించాలన్నారు. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం కి ప్లాన్ చేయాలన్నారు.

రూ. 249 కోట్లతో నగరంలో యూజీడి పనులు జరుగుతున్నట్టు కలెక్టర్ అన్నారు. 6.8 కి.మీ. మేర పైప్ లైన్ పనులు పూర్తయ్యాయన్నారు. చేపట్టిన 2 ఎస్టీపి లలో పుట్టకోట ఎస్టీపీ పనులు పురోగతిలో వుండగా, దంసలాపురం ఎస్టీపీ భూసేకరణ తుది దశలో ఉందన్నారు.

వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో ప్రతిపాదిత పనుల్లో జూ మార్చికల్లా, ఎన్ఐసి భవనాలు జూన్ కల్లా పూర్తవుతాయని, మిగులు పనులన్నీ తుదిదశలో ఉన్నాయని అన్నారు.

రోప్ వే పనుల్లో లోయర్ స్టేషన్ పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. 2 నెలల్లో లోయర్ స్టేషన్ పనులు పూర్తవుతాయని, అప్పర్ స్టేషన్ పనులు మార్చి నెలలో మొదలవుతాయని తెలిపారు. డిసెంబర్, 2026 లోగా ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తవుతాయని అన్నారు. రోప్ వే కు సంబంధించి నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సమర్పించామని అధికారులను ఆదేశించారు.

చింతగుర్తి సర్వే నెం. 266 లో 505 ఎకరాలకు గాను 430 ఎకరాలకు ఎంజాయ్మెంట్ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగులు సర్వే ను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రతి మండలంలో 3 పెద్ద సర్వే నెంబర్లను ఎంపిక చేసి, సర్వే ప్రక్రియ పూర్తి చేసి, సరిహద్దులు ఫిక్స్ చేయాలన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు 75 శాతం పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. స్లాబ్, బ్రిక్ పనులు సమాంతరంగా జరుగుతున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే మే మాసాంతానికి నిర్మాణం పనులన్నీ పూర్తిచేయాలన్నారు. అంతర్గత రహదారులు, హాస్టళ్లకు ప్రహరీల నిర్మాణానికి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు సమర్పించలన్నారు.

ఖమ్మం నియోజకవర్గ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ఏప్రిల్, 2027 కల్లా పూర్తయ్యేలా కార్యాచరణ చెయ్యాలన్నారు. పనుల పురోగతికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలన్నారు. స్వామి నారాయణ్ స్కూల్ కు సంబంధించి ప్రహరీ పనులు పూర్తయి,,నిర్మాణ పనులు ప్రారంభం అయినట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి కావాల్సిన సహాయ సహకారాలను అందించాలని కలెక్టర్ అన్నారు.

మోడల్ మిర్చి మార్కెట్ కు సంబంధించి 7 షెడ్లలో 5 షెడ్ల నిర్మాణం పూర్తయినట్లు కలెక్టర్ అన్నారు. ఎల్ఇడి బోర్డ్స్, వేయింగ్ బ్రిడ్జ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాఫ్ట్ వేర్ రూపకల్పన పనులన్నీ జూన్ కల్లా పూర్తి చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి, మంజూరై ఇంకా ప్రారంభించని ఇండ్లకు లబ్ధిదారుని సంప్రదించి వెంటనే ప్రారంభించేలా చూడాలని, చేయని వారి ఇండ్లు రద్దు చేసి, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మంజూరైన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో పూర్తయి, లబ్ధిదారులకు అందించని వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పురోగతిలో ఉన్న నిర్మాణాల విషయమై ఇంకనూ కావాల్సిన నిధుల గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

# కెరీర్ బాగుండాలంటే వెంటనే ఇలా చేస్తే చాలు



మీరు ఆఫీసులో ఎంత కష్టపడినా ఆశించిన గుర్తింపు రావడం లేదా..? ప్రతి పనిలో ఏదో ఒక ఆటంకం ఎదురవుతోందా..? అయితే మీ కష్టంతో పాటు మీరు రోజూ తీసుకెళ్లే ఆఫీస్ బ్యాగ్‌లో ఉన్న వస్తువులు కూడా దీనికి కారణం కావచ్చు. అందులో మనం పెట్టే కొన్ని వస్తువులు మన ప్రగతిని అడ్డుకుంటాయని శాస్త్రం చెబుతోంది. మరి మీ కెరీర్ సాఫీగా సాగాలంటే మీ బ్యాగ్‌లో ఏవి ఉండాలి..? మనం ఇంటి నుండి ఆఫీస్‌కు వెళ్లేటప్పుడు వెంట తీసుకెళ్లే బ్యాగ్ కేవలం వస్తువులను సర్దుకునేది మాత్రమే కాదు, అది మన వృత్తిపరమైన శక్తికి ప్రతిరూపం. వాస్తు శాస్త్రం ప్రకారం.. మన ఇంట్లోని దిశలు ఎంత ముఖ్యమో, మనం రోజూ వాడే వస్తువుల స్థితిగతులు కూడా అంతే ముఖ్యం. తెలిసి తెలియక మనం ఆఫీస్ బ్యాగ్‌లో పెట్టే కొన్ని వస్తువులు మన పనిలో ఆటంకాలను, మనసులో గందరగోళాన్ని సృష్టిస్తాయి. మరి మీ బ్యాగ్‌లో ఏవి ఉండాలి? చాలామందికి షాపింగ్ చేసిన బిల్లులు లేదా తిన్న వస్తువుల రిసీప్ట్‌లను బ్యాగ్‌లో వేయడం అలవాటు. వాస్తు ప్రకారం.. పాత బిల్లులు ప్రతికూల శక్తిని కలిగి ఉంటాయి. ఇవి మీ మనసులో అనవసరమైన గందరగోళాన్ని సృష్టించి, పనిపై ఏకాగ్రత దెబ్బతినేలా చేస్తాయి. ఇది చివరికి మిమ్మల్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తుంది. కత్తెర్లు, బ్లేడ్లు లేదా ఇతర పదునైన వస్తువులను నేరుగా బ్యాగ్‌లో ఉంచడం వాస్తు రీత్యా అశుభం. ఇవి ప్రతికూలతను పెంచడమే కాకుండా మీ వృత్తిపరమైన అభివృద్ధిని అడ్డుకుంటాయి. ఒకవేళ తప్పనిసరిగా ఉంచాల్సి వస్తే వాటిని ఒక పౌచ్‌లో లేదా కవర్‌లో చుట్టి మాత్రమే ఉంచాలి. రాకపోయినా లేదా విరిగిపోయినా పెన్నులను బ్యాగ్‌లోనే ఉంచడం మనం చేసే అతిపెద్ద తప్పు. విరిగిన పెన్నులు, పనిచేయని ఛార్జర్లు, పాడైపోయిన హెడ్‌ఫోన్‌లు మన శక్తిని క్షీణింపజేస్తాయి. ఇవి బ్యాగ్‌లో ఉంటే మీ పనులు కూడా అలాగే నిలిచిపోతాయని లేదా ఆలస్యం అవుతాయని వాస్తు నియమాలు చెబుతున్నాయి. దువ్వెనలు, పెర్ఫ్యూమ్‌లు లేదా ఇతర వ్యక్తిగత పరిశుభ్రత వస్తువులను బ్యాగ్‌లో ఇష్టమొచ్చినట్లు పడేయకూడదు. వాటిని ఒక ప్రత్యేక పౌచ్‌లో ఉంచి బ్యాగ్‌లో సర్దుకోవాలి. వీలైతే వీటిని ఆఫీస్ డ్రాయర్‌లో ఉంచుకోవడం ఇంకా మంచిది. వారానికి ఒకసారి మీ బ్యాగ్‌ని ఖాళీ చేసి, అనవసరమైన కాగితాలను, చెత్తను తొలగించండి. వస్తువులను సర్దుకున్న తీరు మీ వ్యక్తిత్వాన్ని మరియు మీ పని పట్ల మీకున్న శ్రద్ధను ప్రతిబింబిస్తుంది. ఈ చిన్న చిన్న మార్పులు చేసుకోవడం వల్ల మీ పని వాతావరణంలో సానుకూలత పెరుగుతుంది. మీ ఆఫీస్ బ్యాగ్ ఎంత శుభ్రంగా, పద్ధతిగా ఉంటే మీ కెరీర్ అంత వేగంగా పురోగతి చెందుతుంది.

# బాత్రూమ్‌లో అద్దం ఈ దిశలో ఉంటే కోటీశ్వరులు రోడ్డున పడాల్సిందేనా




ఇంట్లో అనవసరమైన గొడవలు జరుగుతున్నాయా..? ఎంత సంపాదించినా డబ్బు చేతిలో నిలవడం లేదా..? అయితే మీ బాత్రూమ్ అద్దాన్ని ఒకసారి గమనించండి. వాస్తు ప్రకారం బాత్రూంలో అద్దం ఉంచడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. తప్పుడు దిశలో ఉంచిన అద్దం ఇంట్లో ఒత్తిడిని, అశాంతిని పెంచుతుంది. అద్దం ఎటువైపు ఉండాలి? చాలామంది ఇళ్లలో వాస్తు అనగానే కేవలం పూజ గది, వంట గది లేదా బెడ్ రూమ్ దిశల గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ మనం నిత్యం ఉపయోగించే బాత్రూమ్ వాస్తు కూడా మన జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా బాత్రూంలో ఉండే అద్దం విషయంలో చేసే చిన్న తప్పులు ఇంట్లో ప్రతికూల శక్తిని పెంచుతాయని వాస్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాత్రూంలో అద్దం ఉండటంలో తప్పు లేదు కానీ అది ఎటువైపు ఉందనేదే ముఖ్యం. బాత్రూమ్‌లో ఉత్తరం లేదా తూర్పు గోడపై అద్దం ఉంచడం అత్యంత శుభప్రదం. ఇది ఇంట్లో సానుకూల శక్తిని పెంచుతుంది.బాత్రూమ్ తలుపుకు నేరుగా ఎదురుగా అద్దం అస్సలు ఉండకూడదు. తలుపు తీయగానే మన కళ్లు నేరుగా అద్దం మీద పడితే, బయటి నుంచి వచ్చే ప్రతికూల శక్తి తిరిగి ఇంట్లోకి ప్రవహించే అవకాశం ఉంది. అద్దం అందంగా ఉందని ఏ ఆకారంలో పడితే ఆ ఆకారంలో కొనకూడదు. వాస్తు, జ్యోతిష్య శాస్త్రాల ప్రకారం..చతురస్రాకార లేదా దీర్ఘచతురస్రాకార అద్దాలు మాత్రమే బాత్రూమ్‌కు శ్రేయస్కరం. ఇవి మన ఆలోచనల్లో సమతుల్యతను, మనశ్శాంతిని పెంపొందించడంలో సహాయపడతాయి. గుండ్రని లేదా అపసవ్య ఆకారంలో ఉన్న అద్దాలను నివారించడం మంచిది. చాలామంది బాత్రూంలో అద్దం పగిలినా లేదా మచ్చలు పడినా పట్టించుకోరు. కానీ విరిగిన లేదా పగిలిన అద్దం ఇంట్లో ఒత్తిడిని, మానసిక అశాంతిని కలిగిస్తుంది. అద్దంపై మురికి పేరుకుపోవడం వల్ల అది ప్రతికూలతను ఆకర్షిస్తుంది. కాబట్టి బాత్రూమ్ అద్దం ఎల్లప్పుడూ మెరుస్తూ, శుభ్రంగా ఉండాలి. ఒకవేళ అద్దం దెబ్బతింటే వెంటనే మార్చేయడం ఉత్తమం. బాత్రూంలో అద్దం పెట్టడం వల్ల కష్టాలు వస్తాయని కొందరు నమ్ముతుంటారు. కానీ జ్యోతిష్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అది కేవలం అపోహ మాత్రమే. పైన చెప్పిన విధంగా సరైన దిశ, సరైన ఆకారం, శుభ్రతను పాటిస్తే ఆ అద్దం మీకు ఎటువంటి హాని చేయదు సదా సానుకూల ఫలితాలనే ఇస్తుంది.

## నిమ్మరసంలో ఈ ఒక్కటి కలిపి తాగితే కొవ్వు ఐస్‌లా కరగాల్సిందే



చాలామంది బరువు తగ్గడానికి ప్రతిరోజూ ఉదయం పరగడుపున నిమ్మరసం తాగుతుంటారు. అయితే ఈ డ్రింక్‌కు మరింత శక్తిని ఇచ్చే ఒక అద్భుతమైన చిట్కా ఉంది. అదే చియా సీడ్స్. కప్పు నిమ్మరసంలో ఒక టేబుల్ స్పూన్ చియా విత్తనాలను కలిపి ఒక 10 నిమిషాలు నానబెట్టి తాగితే.. అది కేవలం బరువు తగ్గడానికే కాకుండా శరీరానికి ఎన్నో రకాల పోషకాలను అందిస్తుంది. బరువు తగ్గడానికి భేష్: చియా గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇవి నీటిని పీల్చుకుని జెల్‌లా తయారవుతాయి. ఉదయాన్నే ఈ డ్రింక్ తాగడం వల్ల కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన ఆకలి బాధలు తగ్గి కేలరీల వినియోగం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మ్యాజిక్ డ్రింక్. జీర్ణక్రియ మెరుగుపడుతుంది:చియా గింజల్లోని పీచు పదార్థం ప్రేగుల కదలికలను సులభతరం చేస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా మలబద్ధకం వంటి సమస్యలు తొలగి కడుపు శుభ్రంగా ఉంటుంది. గుండెకు రక్షణ కవచం: ఈ విత్తనాల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. నిమ్మరసంలోని యాంటీ ఆక్సిడెంట్లతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. షుగర్ లెవల్స్ కంట్రోల్: మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఒక గొప్ప వరం. చియా గింజలు రక్తప్రవాహంలోకి చక్కెర విడుదలను నెమ్మదింపజేస్తాయి. దీనివల్ల గ్లూకోజ్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా అదుపులో ఉంటాయి. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి: నిమ్మకాయలో విటమిన్-సి, చియా గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాలను రక్షిస్తాయి. దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉండటమే కాకుండా చర్మం కూడా కాంతివంతంగా మారుతుంది.

## ఈ టైమ్‌లో తుమ్మితే అదృష్టమా..?



మనం ఏదైనా శుభకార్యానికి వెళ్తున్నా లేదా ముఖ్యమైన పని మీద ఇంటి నుండి బయటకు అడుగుపెడుతున్నా.. అప్పుడే ఎవరైనా తుమ్మితే చాలు, అడుగు తీసి అడుగు ముందుకు పడదు. తుమ్మారు.. కాసేపు ఆగి వెళ్లు అని ఇంట్లోని పెద్దలు హెచ్చరిస్తుంటారు. అసలు తుమ్ము ఎందుకు అశుభం? శకున శాస్త్రం ప్రకారం కొన్ని సమయాల్లో తుమ్మడం వల్ల అదృష్టం కూడా వరిస్తుందని మీకు తెలుసా? మనం ఏదైనా ముఖ్యమైన పని మీద బయటకు వెళ్తున్నప్పుడు ఎవరైనా తుమ్మితే చాలు.. కాసేపు ఆగి వెళ్లు అని ఇంట్లోని పెద్దలు చెబుతుంటారు. తుమ్మును అశుభంగా భావించడం మన సమాజంలో తరతరాలుగా వస్తున్న ఒక నమ్మకం. అయితే శకున శాస్త్రం ప్రకారం ప్రతి తుమ్ము అశుభం కాదు.. కొన్ని సమయాల్లో తుమ్మడం వల్ల అదృష్టం వరిస్తుందని, ధనలాభం కలుగుతుందని మీకు తెలుసా? బయటకు వెళ్లేటప్పుడు: ఇంటి నుండి బయలుదేరేటప్పుడు లేదా ఎవరైనా మీ ముందు తుమ్మినప్పుడు అది చేసే పనిలో వైఫల్యాన్ని సూచిస్తుందని నమ్ముతారు. ఇలాంటప్పుడు కాసేపు ఆగి నీళ్లు తాగి వెళ్లడం మంచిదని అంటారు.పాలు మరిగేటప్పుడు: పాలు పొయ్యి మీద ఉన్నప్పుడు ఇంట్లోని స్త్రీలు తుమ్మడం అశుభంగా భావిస్తారు. ఇది కుటుంబ సభ్యుల అనారోగ్యాన్ని సూచిస్తుందని నమ్మకం.వాదనల సమయంలో: ఎవరితోనైనా గొడవ పడుతున్నప్పుడు తుమ్ము వస్తే, ఆ పరిస్థితి మరింత దిగజారబోతోందని అర్థం.జంతువుల తుమ్ము: బయటకు వెళ్లేటప్పుడు కుక్క తుమ్మితే అది ఏదో తెలియని ముప్పుకు లేదా విపత్తుకు సంకేతమని చెబుతారు. తుమ్ము ఎప్పుడూ చెడు చేయదు కొన్నిసార్లు అది శుభసూచకం కూడా..మందులు వేసుకునేటప్పుడు: మీరు అనారోగ్యంతో ఉండి మందులు వేసుకునే సమయంలో తుమ్ము వస్తే, మీరు చాలా త్వరగా కోలుకుంటారని దానికి అర్థం.కొత్త వస్తువులు కొనేటప్పుడు: ఏదైనా వస్తువు కొనేటప్పుడు తుమ్మడం శుభప్రదం. ఇది భవిష్యత్తులో ఆ వస్తువు వల్ల మీకు ఆనందం, లాభం కలుగుతాయని సూచిస్తుంది. శుభకార్యాల చర్చల్లో: ఏదైనా మంచి పని గురించి మాట్లాడుకుంటున్నప్పుడు తుమ్మడం విజయాన్ని మరియు ఊహించని ఆర్థిక లాభాన్ని సూచిస్తుంది.శకునాలు ఎలా ఉన్నా తుమ్ము అనేది శరీరంలోని ఒక సహజమైన ప్రక్రియ. ముక్కులోకి వెళ్ళిన ధూళి లేదా ఇతర కణాలను బయటకు పంపడానికి శరీరం చేసే ప్రయత్నమే తుమ్ము. శకునం బాలేదని వచ్చే తుమ్మును బలవంతంగా ఆపుకోవద్దు. అలా చేయడం వల్ల కళ్ళపై, చెవులపై, మెదడులోని రక్త నాళాలపై తీవ్ర ఒత్తిడి పడి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నమ్మకాలు మన సంస్కృతిలో భాగం, కానీ వాటిని గుడ్డిగా నమ్మి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. తుమ్ము వచ్చినప్పుడు సందర్భాన్ని బట్టి జాగ్రత్త పడటం మంచిదే కానీ సహజమైన శారీరక ధర్మాన్ని గౌరవించడం అంతకంటే ముఖ్యం.

## షాంపూతో స్నానం.. జుట్టు ఊడకుండా చిట్కా..



ప్రతి ఒక్కరి అందంలో జుట్టుదే ప్రధాన పాత్ర. అందుకే ప్రతి ఒక్కరూ జుట్టు నల్లగా, పొడుగ్గా ఉండాలని కోరుకుంటారు. అయితే, ఈ రోజుల్లో జుట్టు రాలడం ప్రధాన సమస్యగా మారింది.చిన్నా, పెద్దా తేడా లేకుండా చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ సమస్యతో ఆందోళన ఎక్కువగా చెందుతున్నారు. జుట్టు రాలి ఎక్కడ బట్టతల వస్తుందేమో అన్న ఆందోళన వారిలో కనిపిస్తుంది. ఇక, జుట్టు రాలడం ఆపడం కోసం చాలా మంది అనేక రకాల షాంపూలు, మార్కెట్లో దొరికే ప్రొడక్ట్స్ వాడుతున్నారు. వీటి వల్ల కూడా అనుకున్నంత ఫలితం ఏం కనిపించడం లేదు. ఇవి వాడుతున్నా జుట్టు రాలడం ఆగడం లేదు. అయితే, జుట్టు రాలడం వెనక అనేక కారణాలు ఉండొచ్చు. అంతేకాకుండా మన అలవాట్లు కూడా ఓ కారణమంటున్నారు బ్యూటీ ఎక్స్‌పర్ట్, కంటెంట్ క్రియేటర్ వంశిత. షాంపూతో తలస్నానం చేసే ముందు ఒక పని చేయడం చాలా మంది మర్చిపోతుంటారు. ఆ పని వల్లే జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుందని ఆమె చెబుతున్నారు. ఉదయపూర్‌కి చెందిన వంశిత కంటెంట్ క్రియేటర్. ఆమె ఎక్కువగా బ్యూటీ, ఫ్యాషన్ విషయాలపై ఎక్కువగా కంటెంట్ క్రియేట్ చేస్తుంటారు. ఇందులో ఆమె ఎక్స్‌పర్ట్ అని బయోలో ఉంది. ఇక, తలస్నానం చేయడానికి, జుట్టు సంరక్షణకు సరైన మార్గాన్ని వివరిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు.వంశిత ప్రకారం జుట్టు రాలడానికి మనం చేసే కొన్ని తప్పులే కారణం. కొన్ని అలవాట్లు జుట్టును బలంగా మార్చడానికి, మెరిసేలా చేయడానికి, పొడుగ్గా ఉంచడానికి సాయపడతాయి. చాలా మంది తలస్నానానికి ముందు ఓ పొరపాటు చేస్తుంటారు. తలస్నానం చేసే ముందు జుట్టు దువ్వకోరు. అయితే, షాంపూతో తలస్నానానికి ముందు జుట్టును సరిగ్గా చిక్కులు లేకుండా చూసుకోవడం ముఖ్యం. లేదంటే జుట్టు బలహీనపడి విరిగిపోతుంది.

## కరకరలాడే కార్న్‌ఫ్లోర్ టిక్కీ ఇలా చేసుకుని తింటే..



ఈ కార్న్‌ఫ్లోర్ టిక్కీలు అందరికీ ఫేవరేట్ ఫుడ్. దీనిని మార్నింగ్ టిఫిన్ నుంచి మధ్యాహ్న భోజనం వరకు ఇష్టంగా తింటారు. ఈ రెసిపీని మీ ఇంట్లో ఉండే పదార్థాలతోనే రుచికరంగా చేసుకోవచ్చు. కార్న్‌ఫ్లోర్ టిక్కీ గురించి మీరు వినే ఉంటారు. ఇది తినడానికి మంచి స్నాక్స్. సాయంత్రం సమయంలో వీటిని చేసుకుని తింటే ఆ ఫీలింగే వేరు. దీనిని మీ ఇంట్లో ఉండే వాడే పదార్థాలతోనే ఈజీగా చేసుకోవచ్చు. కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్ ఒక కప్పు, 2 టేబుల్ స్పూన్స్ నూనె, 3 టేబుల్ స్పూన్లు కార్న్‌ఫ్లోర్, బంగాళాదుంప 1, పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు, అర టీస్పూన్ నల్ల మిరియాల పొడి, ఒక టీస్పూన్ కారం. తయారీ విధానం: ఒక గిన్నె తీసుకుని దానిలో ఒక ఉడికించిన బంగాళాదుంప వేసి, ఆ తర్వాత దానిలో స్వీట్ కార్న్ , కార్న్‌ఫ్లోర్, మిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, .సరిపడినంత ఉప్పు, కారం వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు, మీ చేతులకు వంట నూనెను కొద్దిగా రాసి టిక్కీలుగా చేసుకోండి. ఆ తర్వాత స్టవ్ వెలిగించి దాని మీద పాన్ పెట్టి 2 టేబుల్ స్పూన్స్ నూనె వేసి అది వేడయ్యాక టిక్కీలను ఒక దాని తర్వాత ఒకటి పాన్ మీద పెట్టి, వాటిని ఇరు వైపులా రంగు మారే వరకు బాగా వేయించండి. అంతే, వేడి వేడి కార్న్‌ఫ్లోర్ టిక్కీలు రెడీ. వీటిని గ్రీన్ చట్నీతో తింటే రుచికరంగా ఉంటాయి. బయట వాటితో కాకుండా ఇంట్లో ఉండే పదార్థాలతోనే చేసుకుంటాము కాబట్టి, ఇవి స్నాక్స్ కంటే రుచిగా ఉంటాయి. పిజ్జా, బర్గర్ తినే కన్నా ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. అంతే కాదు, ఈ రెసిపీ మన అనారోగ్య సమస్యలకు చెక్ పెడుతుంది.

## గులాబీ పువ్వులా.. ఆషికా అందాలు

అందాల చిన్నది ఆషికా రంగనాథ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ మధ్య సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ, ఈ ముద్దుగుమ్మ తన గ్లామర్‌తో కట్టి పడేస్తోంది. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ చీరలో తన అందాలతో అందరి మనసు దోచేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన క్యూట్ నెస్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది ఈ చిన్నది. నందమూరి కళ్యాణ్ రామ్ సరసన అమిగోస్ చిత్రంలో నటించి, ఈ మూవీతోనే తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. ఈ మూవీలో ఈ అమ్మడు గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ముఖ్యంగా ఎన్నో రాత్రులొస్తాయి గానీ అనే సాంగ్ రీమేక్స్‌లో ఈ ముద్దుగుమ్మ తన గ్లామర్, డ్యాన్స్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇక ఈ మూవీ తర్వాత నాగార్జున సరసన నా సామి రంగ అనే మూవీలో నటించింది. కానీ ఈ మూవీ కూడా అంతగా హిట్ ఇవ్వలేకపోయింది. అయినా కూడా ఈ అమ్మడుకు అవకాశాలు వచ్చాయి. వరసగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఈ ముద్దుగుమ్మకు ఇప్పటి వరకు సరైన హిట్ లేదు అనే చెప్పాలి. ఇక ఈ చిన్నది రీసెంట్‌గా మాస్ మహారాజ్ రవితేజ సరసన భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే మూవీలో నటింటించింది. ఈ మూవీలో ఈ బ్యూటీ, తన నటన, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది , తాజాగా రెడ్ చీరలో ఉన్న బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేసింది. ఇవి అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇక వీటిని చూసిన ఈ అమ్మడు ఫ్యాన్స్ అచ్చం గులాబీలా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.

# మెరుపుల కప్పు.. వచ్చేస్తోంది

## టీ20 ప్రపంచకప్ మరో 4 రోజుల్లో



కప్పులందు ప్రపంచకప్ వేరు.. అందులోనూ పొట్టి ఫార్మాట్లో ప్రపంచకప్ అంటే క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి ఉంటుంది. రోహిత్ సేన బ్రిడ్జ్‌టౌన్‌లో నమ్మశక్యం కాని విజయంతో ప్రపంచకప్‌ను ఒడిసి పట్టిన క్షణాలు ఇంకా కళ్ల ముందు కదలాడుతుండగానే.. ఇంకో కప్పు వచ్చేసింది. ఈసారి ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వబోయేది భారతే కావడం విశేషం. కొన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనూ జరగబోతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా.. అదిరే ఫామ్‌తో టోర్నీలో అడుగు పెడుతోంది. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచాక ఈ ఫార్మాట్లో భారత జట్టు ఒక్క సిరీస్ కూడా ఓడిపోకపోవడం గమనార్హం. దీంతో సూర్యకుమార్‌సేనపై భారీ అంచనాలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ లాంటి జట్లూ బలంగా కనిపిస్తున్నాయి. కిందటిసారి లాగే ఈసారి కూడా అత్యధికంగా 20 జట్లతో పొట్టి ప్రపంచకప్ జరగబోతోంది. తొలిసారిగా బంగ్లాదేశ్ ఈ టోర్నీలో బరిలోకి దిగట్లేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగట్లేదన్న సంగతి తెలిసిందే. అయినా సరే టోర్నీపై ఆసక్తి ఏమీ తక్కువగా లేదు. ఈ నెల 7న మొదలై, మార్చి 8న ఫైనల్‌తో ముగిసే టోర్నీలో మెరుపులకు లోటు లేనట్లే.

**ఏ జట్టు ఏ గ్రూప్‌లో?**

గ్రూప్-ఎ: భారత్, పాకిస్థాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా

గ్రూప్-బి: ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్

గ్రూప్-సి: ఇంగ్లాండ్, వెస్టిండీస్, నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్

గ్రూప్-డి: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, కెనడా, యూఏఈ

**ఫార్మాట్ ఇలా..**

ప్రపంచకప్‌లో బరిలోకి దిగుతున్న 20 జట్లను అయిదు చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్‌లో ప్రతి జట్టూ మిగతా నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. అందులో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లు ఉంటాయి. ప్రతి జట్టూ మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. రెండు గ్రూప్‌ల్లో టాప్-2 జట్లు సెమీస్‌లో చోటు దక్కించుకుంటాయి.

# ఐసీసీకి రూ.2200 కోట్ల నష్టం?

ఐసీసీ ఈవెంట్లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ ద్వారా దాదాపు రూ.2200 కోట్ల ఆదాయం వస్తుందని ఓ అంచనా. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరించడంతో ఐసీసీకి భారీ నష్టం వాటిల్లనుంది. ఈ నెల 15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పాక్ ఆడకపోతే పీసీబీ ఆదాయంపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. ఐసీసీకి కూడా నష్టం తప్పదు. ప్రసారదారు జియోస్టార్ ఇప్పటికే ఐసీసీతో బేరాలకు ప్రయత్నిస్తోంది. భారత్, పాక్ మ్యాచ్ జరగకపోతే ప్రసారదారు రూ.200-250 కోట్ల నష్టపోతుందని అంచనా. వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం జియోస్టార్ కోల్పోనుంది. భారత్, పాక్ మ్యాచ్ సందర్భంగా 10 సెకన్ల స్లాట్ ధర రూ.40 లక్షల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై ఐసీసీ భారీ జరిమానా విధించే అవకాశముంది. ఆ బోర్డుపై కఠిన చర్యలు ఉంటాయని ఇప్పటికే హెచ్చరించింది కూడా. పాక్ నిర్ణయం ఆటకు మంచిది కాదని ఐసీసీ పేర్కొంది. పీసీబీ వార్షిక ఆదాయం సుమారు రూ.300 కోట్లు. 2027 వరకు భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లను హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ఐసీసీ, పీసీబీ, బీసీసీఐ అంగీకరించిన నేపథ్యంలో తన చర్యలను సమర్థించుకోవడం పాక్‌కు కష్టమే. ఒకవేళ నాకౌట్లో భారత్‌తో తలపడాల్సివస్తే ఆ జట్టు ఏం చేస్తుందన్నది ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్న. అప్పుడు కూడా ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకుంటామని ఓ పీసీబీ అధికారి చెప్పాడు. పాకిస్థాన్ ఈ నెల 7న నెదర్లాండ్స్ పోరుతో ప్రపంచకప్ పోరాటాన్ని ప్రారంభించనుంది.

**పాక్‌పై చర్యలు తీసుకోవాలి**

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అన్నాడు. "ప్రపంచవ్యాప్తంగా స్పందనలు చూశాక వచ్చే నాలుగైదు రోజుల్లో పాక్ తన నిర్ణయాన్ని మార్చుకునే అవకాశముంది. ఇందులో కొత్తేమీ లేదు. పాకిస్థాన్ క్రికెటర్లు రిటైరై.. నాలుగైదు రోజుల తర్వాత 'మా అభిమానులు ఇంకా ఆడమని అంటున్నారు' అంటూ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం మనకు తెలుసు. ఇది మరోసారి జరగొచ్చు. రిటైర్మెంట్ నుంచి తిరిగి రావడం పాకిస్థాన్ ఆటగాళ్లకు అలవాటే. అలాంటిదే ఫిబ్రవరి 15 లోపు జరగొచ్చు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడంపై పాక్ సరైన కారణాలు చూపకపోతే పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలి" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. భవిష్యత్తులో ఏ జట్టూ ఇలా చేయకుండా ఉండేలా చర్యలుండాలని సన్నీ అభిప్రాయపడ్డాడు.

# ఆర్సీబీని ఢీకొట్టేదెవరో

## నేడే దిల్లీ-గుజరాత్ ఎలిమినేటర్

### రాత్రి.7.30 నుంచి

వడోదర: డబ్ల్యూపీఎల్-4లో ఆసక్తికర సమరానికి వేళైంది. మంగళవారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో దిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. తొలి మూడు సీజన్లలో ఫైనల్‌కు దూసుకెళ్లిన దిల్లీ.. మరోసారి టైటిల్ సమరానికి అర్హత సాధించాలనే పట్టుదలతో ఉంది. జెమీమా సారథ్యంలోని దిల్లీ పయనం లీగ్ దశలో ఒడుదొడుకులతో సాగింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచి.. నాలుగు ఓడింది. మరోవైపు గుజరాత్ 5 మ్యాచ్‌లు నెగ్గి.. మూడింట్లో ఓడి రెండో స్థానంతో ముందంజ వేసింది. ఈ సీజన్లో వెలుగులోకి వచ్చిన పేసర్ నందని శర్మపై మరోసారి దిల్లీ ఆశలు పెట్టుకుంది. కీలక సమయాల్లో వికెట్లు తీయడమే కాక.. డెత్ ఓవర్లలో బ్యాటర్లకు కళ్లెం వేసి నందని ఆకట్టుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి రాణించడం కూడా దిల్లీకి కీలకం. నందని, శ్రీచరణి ఈ సీజన్లో చెరో 14 వికెట్లు పడగొట్టారు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజేన్ కాప్ ఆ జట్టుకు ప్రధాన బలం. ముంబయితో గత మ్యాచ్‌లో ఆమె బంతితో ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది. జెమీమా, లారా వోల్వార్ట్, లిజెలీ లీ, షెఫాలి వర్మలతో దిల్లీ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఈ సీజన్లో లారా వోల్వార్ట్, లిజెలీ, షెఫాలి 200పైన పరుగులు చేశారు. చివరి లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్‌ను ఓడించడం దిల్లీ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచేదే. అయితే ఆష్లీ గార్డ్‌నర్ నాయకత్వంలోని గుజరాత్‌ను తక్కువ అంచనా వేస్తే దిల్లీకి చేదు అనుభవం తప్పదు. ఆష్లీతో పాటు సోఫీ డివైన్, బెత్ మూనీ, జార్జియా వేర్‌హామ్‌ల రూపంలో ప్రపంచ స్థాయి స్టార్ల బలం ఆ జట్టుకు ఉంది. ముఖ్యంగా సోఫీ డివైన్ బంతి, బ్యాట్‌తో అదరగొడుతోంది. ఆమె ఇప్పటిదాకా 237 పరుగులు చేసి.. 17 వికెట్లు పడగొట్టింది. ఎలిమినేటర్‌లోనూ ఆమె రాణిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో పేసర్ రేణుక సింగ్ సత్తా చాటడం ఆ జట్టుకు ముఖ్యం. ఎలిమినేటర్‌లో గెలిచే జట్టు.. గురువారం ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొంటుంది.

# జాన్వీ అందరికీ పెద్దితో ఆన్సర్ ఇస్తుందా?



అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన జాన్వీ కపూర్ అతి తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలిగారు. జాన్వీ 2018లో ధడక్ అనే రొమాంటిక్ డ్రామాతో హీరోయిన్ గా అరంగేట్రం చేశారు. స్టార్ హీరోయిన్ కూతురిగా ఎంట్రీ ఇచ్చిన జాన్వీకి కెరీర్ స్టార్టింగ్ నుంచే ఏదొక విషయంలో విమర్శలు ఎదురవుతూనే ఉన్నాయి.

**మరోసారి జాన్వీపై విమర్శలు**

జాన్వీ స్థిరంగానే నటించినప్పటికీ, ఆమె యాక్టింగ్ పై విమర్శలు అన్ని సినిమాల్లోనూ జాన్వీని అనుసరించాయి. అయితే ఇప్పుడు ఇదంతా ఎందుకనుకోవచ్చు. రీసెంట్ గా జాన్వీ కపూర్ మరోసారి సోషల్ మీడియాలో విమర్శల పాలవుతున్నారు. ఉమెన్స్ లెగ్గింగ్స్ బ్రాండ్ కోసం జాన్వీ ఓ యాడ్ లో చాలా అతిగా నటించారనే ఆరోపణలతో ఆమె వార్తల్లోకెక్కారు.

**పూర్తి స్థాయి యాక్టింగ్ చూడలేదని కామెంట్స్**

జాన్వీ ఇప్పటివరకు తన కెరీర్లో 14 విభిన్న జానర్ల సినిమాల్లో యాక్ట్ చేసినప్పటికీ, జాన్వీ ఇంకా బిగ్ స్క్రీన్ పై తన యాక్టింగ్ ను పూర్తి స్థాయిలో చూపించలేదని ఓ కామెంట్ వినిపడుతూ ఉంటుంది. 2024లో జూ.ఎన్టీఆర్ తో కలిసి దేవర1 సినిమాలో నటించినప్పటికీ, ఆ సినిమాలో జాన్వీ రోల్ గ్లామర్‌కే పరిమితమైంది తప్పించి యాక్టింగ్ పరంగా పెద్దగా స్కోప్ దక్కలేదు.

మిల్లీ, గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, ఉలాజ్, హోమ్ బౌండ్ లాంటి సినిమాల్లో జాన్వీ యాక్టింగ్ కు కొంతమేర ప్రశంసలొచ్చినప్పటికీ, ఆ సినిమాలు విమర్శకులపై మాత్రం ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లో జాన్వీ ఇప్పుడు రామ్ చరణ్ తో కలిసి తన రెండో తెలుగు సినిమాలో నటిస్తున్నారు. మార్చి 27న పెద్ది సినిమా రిలీజ్ కానుండగా, ఇప్పటికే రిలీజైన చికిరి సాంగ్ ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్ గా నిలిచింది. అయితే ఇప్పటివరకు జాన్వీ నుంచి పూర్తి స్థాయి పెర్ఫార్మెన్స్ చూడనందున పెద్దిలో బుచ్చిబాబు అయినా ఆమెను యాక్టింగ్ ఓరియెంటెడ్ పాత్రలో చూపించబోతున్నారా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి జాన్వీ బాలీవుడ్ లో వస్తున్న విమర్శలకు తెలుగు సినిమాతో చెక్ పెడతారేమో చూడాలి.

# మోడరన్ ఫైర్‌తో శాన్వి శ్రీవాస్తవ క్లాసిక్ బ్యూటీ



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com